సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

మావోయిస్టులతో చర్చలు జరపాలి

ములుగురూరల్, మే 9 : ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి, మావోయిస్టులతో చర్చలు జరపాలని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ అప్జల్‌పాషా, ఎంసీపీఐ జిల్లా నాయకుడు గుండెబోయిన చంద్రయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు విశ్వనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరిపేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కేంద్ర బలగాలు ఆదివాసీలు, మావోయిస్టులపై హత్యాకాండ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మావోయిస్టు పార్టీ ప్రతినిధులను శాంతి చర్చలకు పిలవాలని సూచించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చివరి మావోయిస్టును చంపేదాకా వదిలిపెట్టబోమని మాట్లాడటం ప్రజాస్వామ్య దేశంలో అత్యంత అభ్యంతకర విషయమన్నారు. నాయకులు బానోత్ నర్సింహ, స్వామి, నాంపెల్లి స్వామి, మొగిలి, ఇంజం కొమురయ్య, గొంది సాంబయ్య, రత్నం రాజేందర్, కుర్ర రాజు, ప్రవీణ్, ఆదిరెడ్డి, మల్లయ్య, రాజన్న పాల్గొన్నారు.

మల్లూరులో బ్రహ్మోత్సవ వేడుకలు

ధ్వజారోహణకు సిద్ధమైన గరుడపటం

మంగపేట, మే 9 : మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేద పండితుల ఆధ్వర్యంలో దైత అమ్మవారికి పంచామృత అభిషేకాలు చేశారు. స్వామివారిని ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. సాయంత్రం 6 గంటలకు దేవస్థాన ప్రాంగాణంలో గరుడ పటాన్ని వేశారు. అనంతరం గరుడాధివాసం నియమ నిష్ఠల నడుమ నిర్వహించారు. హేమాచలుని కల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానం పలికేందుకై నేడు (శనివారం) ధ్వజారోహణ నిర్వహించనున్నట్లు భద్రాచలం, స్థానిక దేవస్థాన అర్చకులు తెలిపారు. వేడుకల్లో ఈవో సత్యనారాయణ, ఎస్సై సూరి, భద్రాచలం రామాలయ అర్చకులు శ్రీమురళీకృష్ణమాచార్యుల బృందం, దేవస్థాన అర్చకులు ఎం రాజశేఖరశర్మ, కే పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చందు శర్మ, వెంకటనారాయణశర్మ, సీతారాములు, సుధీర్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

భూపాలపల్లి రూరల్, మే 9 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కొనుగోలు కేంద్రాల పనితీరుపై జిల్లా అధికారులు, హమాలీ సంఘాల నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అకాల వర్షాలు, అధిక కూలీ రేటు వల్ల రైతులు కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇకముందు జిల్లా వ్యాప్తంగా ఒకే కూలీ రేటు అమలు చేయాలని హమాలీ సంఘం నాయకులను కోరారు. హమాలీ కొరత ఉన్న గ్రామాల్లో పక్క గ్రామాల వారితో పనులు చేయించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా సహకార అధికారి వాల్య నాయక్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీరాములు, సహాయ కార్మిక శాఖ అధికారి వినోద పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో టెలీ కాన్ఫరెన్స్

ములుగురూరల్, మే 9 : నూతనంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్స్ హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంపై శుక్రవారం డీఎంహెచ్‌వో గోపాల్‌రావు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్త పోర్టల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల వివరాలను రిజిస్ట్రేషన్ చేయాలని అన్నారు. ఈ విధానం పూర్తయిన అనంతరం వారిని వైద్యుల వద్దకు పంపించాలని అన్నారు. రోగి లక్షణాలను అడిగి తెలుసుకున్న అనంతరం వైద్యులు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. రోగులు సైతం తప్పని సరిగా ఆధార్ కార్డులను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

సమ్మె వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ములుగురూరల్, మే 9 : జిల్లాకేంద్రంలోని ఆటో నగర్ వద్ద ఆటో డ్రైవర్లతో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ శుక్రవారం సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. 20వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెలో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, జీపీ కార్మికులు, షాపు వర్కర్స్ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు, డ్రైవర్లు రవి, నారాయణ, నర్సింహ, క్రాంతి, శ్రీను, రాజు, చంద్రమౌళి, అనిల్, మొగిలి, కుమారి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

గోదాం కావలెను

★పెద్దవంగరలోని మన గ్రోమోర్ సెంటర్‌కు పర్మినెంట్ గోదాం కావలెను. 1500-2000 Sq.fts గలది పెద్దవంగర మేన్ రోడ్ పరిధిలో కావలెను. సంప్ర: 9121044072, 91001007590.

NTW-337013

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

అధికారులు కాళేశ్వరంలోనే ఉండాలి

- పుష్కరాల అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
- 'నమస్తే' కథనానికి స్పందన

పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 9 : సరస్వతీ పుష్కరాలు పూర్తయ్యే వరకూ అన్ని శాఖల అధికారులు కాళేశ్వరంలోనే మకాం వేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'ముక్తీశ్వర ఏమిటీ నిర్లక్ష్యం' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. దీనికి స్పందించిన కలెక్టర్ పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆలయ ఈవో కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని విభాగాలు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన స్టేజి, మైక్ ఇతర ఏర్పాట్లు, పారిశుధ్య పనులు, సిబ్బందికి ఆహార ఏర్పాట్లపై పర్యవేక్షణకు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అత్యవసర మందులు, ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉండాలని తెలిపారు. అత్యవసర సేవలకు మహాదేవపూర్‌లో 30 బెడ్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం వీవీఐపీ ఘాట్ గోదావరిలో నీటిమట్టం, టెంట్ సిటిని పరిశీలించారు. టెంట్ సిటీ వద్ద వర్షం వచ్చినా బురద కాకుండా గ్రావెల్ వేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీపీవో వీరభద్రయ్య, ఈవో మహేశ్, డీఎంహెచ్‌వో మధుసూదన్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్, డీటీ కృష్ణ, మెడికల్ ఆఫీసర్ సుస్మిత, ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఇంజినీరింగ్, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

యుద్ధంలో విజయం సాధించాలి

ఆలయాలు, మసీదుల్లో ప్రార్థనలు, పూజలు

మహదేవపూర్(కాళేశ్వరం)/తాడ్వాయి/ వెంకటాపూర్/ చిట్యాల, మే 9 : ఆపరేషన్ సింధూర్‌లో ధైర్యంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. కాళేశ్వరముక్తీశ్వర ఆయలంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈవో మహేశ్, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు నగేశ్ శర్మ పాల్గొన్నారు. మేడారంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారులు, దేవాదాయ శాఖ సిబ్బంది పూజలు చేశారు. ఆపరేషన్ విజయవంతం కావాలని కోరుతూ సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రామప్పలో ఎండోమెంట్ పరిశీలకులు కవిత, ఈవో బిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డిపల్లెలో బేతి సతీశ్ ఆధ్వర్యం లో, నల్లగుంటలో నాగుల రవి, రామగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులు పూజలు నిర్వహించారు. చిట్యాల మండలకేంద్రంలోని కౌసర్ఏ మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మాజీ కోఆప్షన్ సభ్యులు రాజమహ్మద్, మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మొహ్మద్ అజ్మత్ మియా, హైదర్ పాషా పాల్గొన్నారు.

రైతులు ఫార్మర్ రిజిస్టర్‌లో పేరు నమోదు చేసుకోవాలి

భూపాలపల్లి డీఏవో వీరు నాయక్

వడ్ల తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఏవో వీరునాయక్

మొగుళ్లపల్లి, మే 9 : భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్టర్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వీరు నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్సిపేట, మొగుళ్లపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కొనుగోలు తదితర వివరాలను అడిగి తెలుసుకొని నిర్వాహకులకు సూచనలు చేశారు. కేంద్రాల్లో ధాన్యం నిల్వలేకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు డబ్బులు సకాలంలో అందేలా ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చాలన్నారు. అనంతరం మండలకేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయాధికారులతో సమావేశమై ఫార్మర్ రిజిస్టర్‌లో రైతుల నమోదు వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో సురేందర్‌రెడ్డి, ఏఈవో జ్యోత్స్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంగపేట, మే 9 : మండలంలోని కమలాపురం శివారు దొంగలొర్రె-పెట్రోల్ బంకు మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోమటిపల్లికి చెందిన బొడ్డు నగేశ్(36) మృతి చెందగా పులి వెంకటయ్యకు రెండు కాళ్లు విరిగాయి. స్థానికుల కథనం ప్రకారం.. నగేశ్ కమలాపురం వైపు నుంచి కోమటిపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. పులి వెంకటయ్య స్వగ్రామం కోమటిపల్లి నుంచి కమలాపురం వైపునకు బైక్‌పై వస్తున్నాడు. ఈక్రమంలో కమలాపురం నుంచి మంగపేట వైపు వెళ్తున్న ఓ కారు లారీని ఓవర్‌టేక్ చేస్తూ ముందుగా నగేశ్ బైక్‌ను ఢీకొట్టింది. కారు బెలూన్లు ఓపెన్ అయి దారి కనిపించక వెంకటయ్య బైక్‌ను కూడా ఢీకొట్టింది. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. అప్పటికే నగేశ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటయ్యకు కాళ్లు విరగడంతో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. వెంకటయ్య కన్నాయిగూడెం విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపురం(నూగూరు), మే 9 : మండలంలోని విద్యార్థులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో జీవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన సమ్మర్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. ఆటలు, పాటలు, డ్రాయింగ్, యోగా, కరాటే, డ్యాన్స్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాలు నేర్పుతారన్నారు. క్యాంపు ఇన్‌చార్జిగా శేష నర్సింహారావు, సూర్యనారాయణ, శ్రీనివాస్‌ను నియమించినట్లు తెలిపారు.


నివాళులర్పిస్తున్న పుట్ట మధు

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మహాముత్తారం, మే 9 : మండలకేంద్రంలోని మాజీ ఎంపీటీసీ శ్రీపతి సురేశ్ తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా శుక్రవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. అలాగే కోణంపేట గ్రామానికి చెందిన చీడెం లక్ష్మి ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెల్మారెడ్డి అనిల్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మార్క రాముగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీపతి సురేశ్ నాయకులున్నారు.

ఏఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న హర్షిణి

గృహ నిర్మాణ శాఖ ఏఈగా హర్షిణి

మొగుళ్లపల్లి, మే 9 : మండల గృహ నిర్మాణ శాఖ ఏఈగా హర్షిణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో సుబాష్ చంద్రబోస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

జీసీసీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మహాముత్తారం, మే 9 : మండలంలోని బోర్లగూడెంలో శుక్రవారం గిరిజన సహకార సంస్థ (GCC) వారిచే ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. రైతులు ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని, దళారులకు తక్కువ ధరకు అమ్ముకొకని నష్టపోవద్దని రైతు సంఘ నాయకులు తెలిపారు.

సబ్ పోస్టాఫీస్ కార్యాలయం ప్రారంభం

మహాముత్తారం, మే 9 : మండలంలో సబ్ పోస్టాఫీస్‌ను శుక్రవారం పెద్దపల్లి డివిజనల్ సూపరింటెండెంట్ బానోత్ నంద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న ఉప తపాలా కార్యాలయం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తపాలా శాఖ ద్వారా అందించే బ్యాంకింగ్ సేవలు, ఇన్సూరెన్స్ సేవలు, రిజిస్టర్ పోస్టు, స్పీడ్ పోస్ట్ తదితర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, సబ్ పోస్ట్ మాస్టర్ రమేశ్, మండల సీనియర్ బీపీఎం చెరుకు సురేశ్‌రెడ్డి, శ్రీధర్, సత్యం, శంకర్, పోచయ్య, బోర్లగూడెం ఏబీపీఎం పూల్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టు నాయకులు

జర్నలిస్టులను నియంత్రించాలనుకోవడం అవివేకం

కృష్ణకాలనీ, మే 9: పోలీసులను అడ్డుపెట్టుకొని జర్నలిస్టులను నియంత్రించాలనుకోవడం రాజకీయ నాయకులకు అవివేకమని జర్నలిస్టుల సంఘాల నాయకులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో పోలీసులు సోదాలు చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో కాకతీయ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులతో అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛను అడ్డుకున్న ప్రతీ రాజకీయ పార్టీకి తగిన గుణపాఠం తప్పదవి వారు హెచ్చరించారు.

పంటల సాగుపై అవగాహన

ములుగురూరల్, మే 9 : ములుగు మండలం జగ్గన్నపేటలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వారి సహకారంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ అల్దాసు జానయ్య పాల్గొని రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగులో మెళకువలు వివరించారు. అలాగే సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలని, పంట మార్పిడి తప్పక చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫర్ రిసెర్చ్ డాక్టర్ ఉమారెడ్డి, ములుగు జిల్లా వ్యవసాయ అధికారి సురేశ్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారి అనసూయ పాల్గొన్నారు.

20న సార్వత్రిక సమ్మె

భూపాలపల్లి రూరల్, మే 9 : ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట కార్యదర్శి చెన్నూరు రమేశ్‌తో కలిసి సమ్మె నోటీసు రిలీజ్ చేశారు. అనంతరం మాట్లాడుతూ సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా సంపూర్ణ మద్దతును ప్రకటించిందని తెలిపారు. పని స్థలాల వద్ద గేట్ మీటింగ్‌లు, కరపత్రాల పంపిణీ వంటి వాటిని సైతం నిషేధించడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటినీ తుంగలోకి తొక్కుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సహాయ కార్యదర్శి ఆకుదారి రమేశ్, నాయకులు సీహెచ్ రవికుమార్, రాజేందర్, ఆకుల రవి, కార్మికులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, మే 9 : హైదరాబాద్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం డిప్లొమా కోర్సులకు అనాథ బాలికలు, నిరాశ్రయులైన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 240 సీట్లకు 70 శాతం సీట్లు అనాథ, నిరాశ్రయులైన, అక్రమ రవాణా బాధిత బాలికలకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా పదో తరగతిలో ఉత్తీర్ణత పొంది ఉండాలని, మూడు శాతం సీట్లు దివ్యాంగ బాలికలకు కేటాయించారని, ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతోపాటు వసతి కల్పిస్తారని తెలిపారు. దరఖాస్తు ఫారం, విద్యా అర్హత, కులం, నివాసం, తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలు మే 20 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. వివరాల కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, 9491051676 నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

భూపాలపల్లి పట్టణంలోని రెండిళ్ల చోరీ

భూపాలపల్లి రూరల్, మే 9: భూపాలపల్లి పట్టణంలోని ఎండీ క్వాంటర్స్‌లోని రెండు ఇళ్లలో గురువారం రాత్రి దొంగలు బంగారం, వెండి దోచుకొనిపోయారని సీఐ నరేశ్‌కుమార్ శుక్రవారం రాత్రి తెలిపారు. కాశ వేణు ఇంట్లో తులం బంగారం, కేజీ వెండి, సెల్‌ఫోన్, దుర్గం రామదాసు ఇంట్లో 8 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, త్వరలో దొంగలను పట్టుకుంటామని తెలిపారు. ఎవరైనా సెలవుల్లో ఊరికి వెళ్తున్నట్లు అయితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని సీఐ తెలిపారు.

కాళేశ్వరంలో పోలీసుల విస్తృత తనిఖీలు

మహదేవపూర్, మే 9 : సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో మండలంలోని అంబట్‌పల్లిలో ఉన్న మేడిగడ్డ బరాజ్ వద్ద ఎస్సై సాయి శశాంక్ ఆధ్వరంలో పోలీలు విస్తృత తనిఖీలు చేశారు. వాహనదారుల ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. పుష్కరాల్లో ఎలాంటి అవాంఛనీచ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీ పోలీసులు, సివిల్ పోలీసులు కిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం, మే 9 : సరస్వతీ పుష్కరాల దృష్ట్యా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా కోసం వల్లెంకుంట, తాడిచెర్ల 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులతో శనివారం మల్హార్, కాటారం మండలాల్లోని పలు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని కాటారం ఏడీఈ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ధన్వాడ, గంగారం, దామెరకుంట, మల్హార్ మండలంలోని కొయ్యూర్, రుద్రారం, తాడిచెర్ల, పెద్దతూండ్ల, మల్లారం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

గురుకులాల్లో ఇంటర్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్

ఏటూరునాగారం, మే 9 : భూపాలపల్లి, మహబూబాబాద్ రీజియన్ పరిధిలోని గిరిజన గురుకుల కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఇంటర్‌లో ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఈనెల 15న బాలురకు,16న బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ టీ హరిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటూరునాగారం క్రీడా పాఠశాలలో బాలురకు, గిరిజన బాలికల గురుకుల కళాశాలలో బాలికలకు ఉదయం 11గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అర్హులైన వారు టీసీ, మెమో, స్టడీ సర్టిఫికెట్లు కులం, ఆదాయం, రెండు పాస్ ఫొటోలు, ఆధార్ కార్డులతో హాజరు కావాలని సూచించారు. బాలురకు కాటారం, ఏటూరునాగారం, ములుగు, దామరవంచ, మహబూబాబాద్, మరిపెడ, రెడ్యాల, బాలికలకు కాటారం, ఏటూరునాగారం, వెంకటాపురం, కొత్తగూడ, కేసముద్రం, మహబూబాబాద్ కళాశాలల్లో ప్రవేశం కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతీ గ్రూపులో ఎస్టీ విద్యార్థులతో పాటు ఎస్సీ, బీసీ, అనాథ, స్పోర్ట్స్, దివ్యాంగులకు ఒక సీటు చొప్పున కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తామన్నారు.

రామప్పను సందర్శించిన హనుమకొండ జిల్లా జడ్జి

వెంకటాపూర్, మే 9 : రామప్ప దేవాలయాన్ని హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పట్టాభి రామారావు ములుగు సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్‌తో కలిసి సందర్శించారు. రామ లింగేశ్వరస్వామికి వారు పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టతను గైడ్లు విజయ్‌కుమార్, వెంకటేష్ వివరించగా రామప్ప శిల్పా కళా సంపద బాగుందని కొనియాడారు. వారివెంట ఎస్సై జక్కుల సతీశ్ ఉన్నారు.

రామాలయ భూముల కౌలుకు వేలం

ఏటూరునాగారం, మే 9 : మండలకేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయ భూములకు శుక్రవారం వేలం నిర్వహించారు. 2.29 ఎకరాల భూమికి ఏడాది కౌలు నిమిత్తం కమిటీ ఆధ్వర్యంలో వేలం వేయగా రూ.1.10 లక్షలకు రైతు గార పోశాలు దక్కించుకున్నట్లు కమిటీ అధ్యక్షుడు అలువాల శ్రీనువాస్ తెలిపారు. గత ఏడాది రూ. 60 వేలంపై ఆదాయం రాగా ఈసారి పోటీ ఉండడంతో రూ. 1.10ల క్షలు వచ్చాయి.

పాఠశాలల్లో సమ్మర్ క్యాంపు

మంగపేట, మే 9 : మండలంలోని కమలాపురం, రాజుపేట, మంగపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 9 తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులను శుక్రవారం ఎంఈవో మేనక ప్రారంభించారు. ప్రతీ రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు డాన్స్, ఈజీ మ్యాథ్స్, సైన్స్ ప్రయోగాలు, డ్రాయింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈనెల 23వ వరకు క్యాంపులు కొనసాగుతాయని ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్లేశ్ (ఫైల్)

ములుగురూరల్, మే 9 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మల్లంపల్లి మండలం పందికుంట క్రాస్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ములుగు జిల్లా కేంద్రానికి చెందిన గొర్రె మల్లేశ్ (35) పందికుంటలోని బంధువుల ఇంట్లో వివాహానికి భార్య పిల్లతో ద్విచక్ర వాహనంప